క్లుప్తంగా

పేద సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి



జి.కొండూరు: భూ ఆక్రమణోద్యమాల ద్వారా భూమిని సాధించుకుని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలను పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. చెవుటూరు గ్రామంలో పేద సాగుదారులతో కలిసి కోటేశ్వరరావు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెవుటూరు గ్రామంలో 62 ఎకరాల భూమిలో నిరుపేదలు రెండు దశాబ్దాలుగా సాగు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టాలను పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. పట్టాల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో భూ పోరాట నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మైలవరం: మైలవరం మండల కాపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మైలవరంలోని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి రామారావు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన ఇరువురు కాపు విద్యార్థులను సన్మానించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున అందజేశారు. మైలవరం మండల కాపు సంఘం అధ్యక్షుడిగా కర్రెడ్ల సీతయ్య ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ధరణికోట శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల రత్తయ్య, కోశాధికారిగా బీమన రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎల్. నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను కాపు పెద్దలు అభినందించారు

మంచినీటి బోరు ఏర్పాటు



మైలవరం: మైలవరం మండలం గణపవరం గ్రామంలోని కొత్త కాలనీ వాసుల నీటి సౌకర్యార్థం రూ.83 వేల వ్యయంతో నూతనంగా ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మేనల్లుడు బొల్లారెడ్డి యువరాజ్‌రెడ్డి తన సొంత నిధులతో బోరు ఏర్పాటు చేశారని కాలనీ వాసులు ఆనందం వ్యక్తంచేశారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



చాట్రాయి: వ్యవసాయ భూముల్లోకి వెళ్లే అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల్లోకి వెళ్లే అంతర్గత రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై ఎరువుల కట్టలు వేసుకెళ్లాలంటే వీలుపడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసిన నాటి నుంచి కోతలు కోసే వరకు ఈ రోడ్లపై తిరగాల్సి ఉందని, వర్షాలు కురవకముందే ఈ రోడ్లపై గ్రావెల్ వేయంచాలని రైతులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం సర్వే



ముసునూరు: వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏరియాల్లోని ప్రజల మౌలిక సదుపాయాలు, సమస్యల గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు తెలిపారు. ఆ పార్టీ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ముసునూరు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏరియాల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా ముఠా కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీల జీవన స్థితిగతులు, వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యలపై సర్వే చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు డివిజన్‌లో అధిక వర్షపాతం నమోదు

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. తిరువూరు మండలంలో 26.8 మిల్లీమీటర్లు, గంపలగూడెంలో 28.2, విస్సన్నపేటలో 25.4, ఎ.కొండూరు మండలంలో 24.6, రెడ్డిగూడెంలో 38.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు వివరించారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

- రైతులపై కూటమి ప్రభుత్వ వివక్ష
- రైతు భరోసా కేంద్రాల నిర్మాణాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం
- ఎరువులు, పురుగు మందుల సరఫరాను నిలిపివేసిన వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా భవనాలు



నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన జి.కొండూరు రైతు భరోసా కేంద్రం భవనం



నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తున్న వెల్లటూరు రైతు భరోసా కేంద్రం భవనం

జి.కొండూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ సేవలను రైతుల వద్దకే చేర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన రైతు భరోసా కేంద్రాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేసింది. దీనితో నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల భవనాలు పిచ్చిచెట్లు, అసాంఘిక కార్యకలాపాలకు అవాసాలుగా మారాయి.

నిర్మాణాలను నిలిపివేసి..

జి.కొండూరు మండల పరిధిలో మొత్తం 16 గ్రామ సచివాలయాలకు గానూ 16 రైతు భరోసా కేంద్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో కుంటముక్కల, కోడూరు, వెల్లటూరు, హెచ్.ముత్యాలంపాడు, కవులూరు, కట్టుబడిపాలెం, గడ్డమణుగు, చెర్వుమాధవరం రైతు భరోసా కేంద్రాల భవనాలు మాత్రమే నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ దశల్లో ఉన్న భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇప్పుడు అవి పిచ్చిమొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రైతు సేవలకు ఉపయోగపడాల్సిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయాయి.

సేవలు నిలిపివేసి..

గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా, ఈ క్రాప్, ధాన్యం కొనుగోలు వంటి సేవలు 100కిపైగా అందించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి ఎరువులు, పురుగు మందుల సరఫరాను నిలిపివేశారు. దీనితో ప్రైవేటు ఎరువులు, పురుగు మందుల షాపులకు రెక్కలొచ్చాయి. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ఆర్డర్ల కోసం ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌లు సైతం మూలకు చేరాయి.



భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి

రైతు భరోసా కేంద్రాల కోసం చేపట్టిన భవన నిర్మాణాలన్నీ పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేయడం వివక్షకు అద్దం పడుతోంది. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పిచ్చి చెట్లతో నిండిపోయి నిరుపయోగంగా ఉన్నాయి. వాటిపై పెట్టిన ఖర్చు కూడా వృథా అవుతోంది.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు, కవులూరు గ్రామం



అందుబాటులోకి తేవాలి

ప్రభుత్వం రైతులపై వివక్ష చూపకుండా గత ప్రభుత్వం అందించిన సేవలన్నీ కొనసాగించాలి. రైతు భరోసా కేంద్రాల కోసం గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగుమందుల సరఫరాను కొనసాగించాలి.

– జడ రాంబాబు, రైతు, దుగ్గిరాలపాడు గ్రామం

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులు

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సింహారావు పాలెం ప్లాటినమ్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో 316డి జిల్లా గవర్నర్ లయన్ గద్దె శేషగిరి కార్యక్రమంలో పాల్గొన్నారు. గద్దె శేషగిరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను వివరించారు. చనుమోలు నాగభూషణం, చింతలదర్శి చెన్నారెడ్డి అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కమిటీ హనరరీ చైర్‌పర్సన్ ఎస్వీ సుధాకరరావు, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ ఎస్వీఎస్ నివృతరావు, డీసీ డాక్టర్ సీహెచ్ బాలగోపాల రెడ్డి, గవర్నర్స్ ఏరియా రిప్రజంటేటివ్ జాస్తి వెంకటేశ్వరరావు, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ పర్సన్ లింగమ శివశంకర్, గాట్ ఏరియా లీడర్ మూల్పూరి ఉపేంద్ర, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ వీవీపీఎస్ ఆంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో సత్ఫలితాలు



హెచ్‌ఎం మురళీకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న బ్రహ్మకుమారి వింధ్య

తిరువూరు: విద్యార్థులు సానుకూల దృక్పథంతో మంచి ఫలితాలు సాధించవచ్చని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ తిరువూరు శాఖ నిర్వాహకులు వింధ్య అన్నారు. మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం మెడిటేషన్, డిజిటల్ వెల్‌నెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకాగ్రత, మానసిక ప్రశాంతత కోసం ప్రతి రోజూ పాఠశాలలో, ఇంటి వద్ద ధ్యానం చేయాలని, సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తక్కువ సమయం వినియోగించాలని సూచించారు. మునుకుళ్ల జెడ్పీ విద్యార్థులకు మెడిటేషన్‌పై ఆసక్తి పెంపొందిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయుడు జక్కేపల్లి మురళీకృష్ణను అభినందించి జ్ఞాపిక బహుకరించారు.

నేరప్రవృత్తిని విడనాడాలి



రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కొండలరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నేర ప్రవృత్తిని వీడి మంచి నడవడికతో, సత్ ప్రవర్తనతో మెలిగిన వారిపై షీట్లు తొలగిస్తామని కొత్తపేట సీఐ చిన్న కొండలరావు తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండలరావు మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ఆదివారం స్టేషన్‌కు వచ్చి కనబడి వెళ్లుతున్నాం.. మిగిలిన రోజుల్లో ఏం చేసినా చెల్లుతుందనే భావన వద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే సమాచారం ఉందన్నారు. అటువంటి వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదే విధంగా ఎవరైనా, ఎక్కడైన గొడవలకు దిగినా, ఇతర నేరాల్లో పాల్గొన్నా వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సాహితీ విలువలను చాటిన సంగీత రూపకం

విజయవాడకల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విష్ణు సేవా ప్రబంధం గేయ సంగీత, సాహిత్య రూపకం సాహితీ విలువలను చాటింది. తంజావూరును పాలించిన మరాఠీ మహారాజు షహాజీ భోంస్లే రచించిన విష్ణుమాయా ప్రబంధం గేయ సంగీత యక్షగానాన్ని సంగీత విద్వాంసుడు గౌరీనాథ్ పర్యవేక్షణలో నిర్వహించారు. విష్ణుమూర్తి వియోగం భరించలేని లక్ష్మీదేవి తన చెలికత్తెలను వైకుంఠం పంపడం.. అక్కడ శ్రీమహావిష్ణువు సమస్త దేవతలతో కొలువై ఉండటం, విష్ణువును చేరుకోలేని చెలికత్తెలు నారద మహాముని సాయం కోరడం.. వారు నిరాకరించడం, చివరకు చెలికత్తెలు శ్రీమహావిష్ణువుకు లక్ష్మీదేవి మానసిక వేదనను తెలియజేయడం, ఆయన పల్లకీలో లక్ష్మీదేవి దగ్గరకు వెళ్లడం అంశంగా సంగీత రూపకం సాగింది.

నిర్వాహకులకు అభినందన..

గాత్రం లక్ష్మీప్రసన్న, రాజ్యలక్ష్మి అయ్యర్, శ్రీనిధి పాలపర్తి, వైదేహీ పూజ్యం, సాయి శ్రేయ, శ్రీనిధి వాద్య సహకారం అందించారు. వయోలిన్‌పై కోలం సాయికుమార్, వీణ రాయప్రోలు సుధాకర్, వేణువు శేషం రమణ, ఘటంపై డాక్టర్ శ్రీకాంత్, రామానుజపురం సహకరించారు. కార్యక్రమాలను శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ ప్రారంభించారు. శ్రీసద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ యక్షగాన రూపాన్ని నేటి తరానికి అందించాలనే సంకల్పంతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్లకీ సేవా ప్రబంధంలోని సాహిత్య విశేషాలను డాక్టర్ గుమ్మా సాంబశివరావు వివరించారు. వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి శ్రీసద్గురు సంగీత సభ నిర్వాహకుల కృషిని అభినందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడకల్చరల్: అయాచితుల కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ఐదో వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జీవీఆర్ ఘంటసాల కళాశాలలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా నాట్యాచారిణి నవ్యశ్రీ బృందంలోని చిన్నారులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. రాజా గురుభవానీ బృందం ఇంద్రకీలాద్రిపై కొలువైన లోకమాత కనకదుర్గమ్మపై భక్తిగీతాలను ఆలపించారు. విజయవాడ సాంస్కృతిక సమితి వారు ఎరమింగిన చేప, సాగర్ ఆర్ట్స్ వారు కాలజ్ఞానం నాటికలను ప్రదర్శించారు. అయాచితుల కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అయాచితుల రామకృష్ణ మాట్లాడుతూ సంస్థ సాంస్కృతి కళారూపాల ప్రదర్శనకు పెద్దపీట వేస్తోందన్నారు. నాటక రచయిత దర్శకుడు కత్తి శ్యాంప్రసాద్, రంగస్థల నటుడు పట్నాయక్, వివిధ రంగాలకు చెందిన నీలం దుర్గారావు, జీ బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.

24న వాహనాల వేలం

తిరువూరు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 24న వేలం వేస్తామని తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్ తెలిపారు. 19 మోటారు వాహనాలను ఉదయం 10.30 గంటలకు తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తామన్నారు. అధిక మొత్తంలో వేలం పాడిన వారికి వాహనం స్వాధీనపరుస్తామని చెప్పారు. పాటదారు వాహనం ధర మొత్తం వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు తమ స్టేషన్‌లో కానీ, సెల్: 94409 02463 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల ఆక్రమణలపై నివేదిక

ముసునూరు: మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు పాత హైస్కూల్ తరగతి గదులను స్థానికులు తమ ప్రైవేట్ అవసరాలకు వినియోగించుకోవడంపై గ్రామస్తులు నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ పాఠశాల ప్రస్తుత పరిస్థితి, ఏ శాఖ ఆధీనంలో ఉన్నదో తేల్చాలని ముసునూరు ఎంపీడీఓను ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ క్షేత్ర పరిశీలన చేసినట్లు సమాచారం. కాగా పాఠశాల పరిస్థితి, ఆక్రమణలపై ఉన్నతాధికారులకు సోమ, మంగళ వారాల్లో నివేదిక పంపనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

250 మందికి వైద్య పరీక్షలు

నూజివీడు: పల్లెర్లమూడిలో జ్యోతిరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కీళ్ల నొప్పులు, చిన్నపిల్లల వ్యాధులు, ఉబ్బసం, ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధులు, నేత్ర సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు శిలారపు చిట్టిబాబు నేతృత్వంలో వైద్యులు 250మందికి వైద్య సేవలందించారు. దావులూరు కృష్ణమోహన్, యనమదల సత్యనారాయణ, బెజవాడ శ్రీనివాసరావు, బడిపాటి రాజేష్, శిలారపు సంగీతరావు, సర్పంచి పులపాక సౌమ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి గడువులోగా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపుతామని చెప్పారు.

వైభవంగా శోభనాచలుడి కల్యాణం



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో స్వామి వారి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం జ్యేష్ఠ బహుళ ద్వాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంత శేషుబాబు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అర్చకుడు అనంత్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నూజివీడు: నూజివీడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీషా అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని సమస్యలపై చర్చ, 24 ప్రభుత్వ శాఖలపై సమీక్ష జరుగుతుందని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలకు ప్రతాప్ పరామర్శ



కార్యకర్త వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొంది ఆగిరిపల్లిలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ కార్యకర్త చెన్ను వెంకటేశ్వరరావును మేకా ప్రతాప్ పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. సురవరానికి చెందిన కార్యకర్త ధర్మారావు భార్య మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ సాదం గోపి, నక్కన బోయిన శ్రీమన్నారాయణ, చిమట శ్రీనివాసరావు, ఎస్‌కే సుభాని, వాక సక్కేశ్వర రావు, కంబాల ప్రదీప్ పాల్గొన్నారు.

విద్యుత్ లేక.. జనరేటర్ వేయక

ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ రోగులు



నూజివీడులోని ఏరియా ఆస్పత్రిలో కరెంటు లేక ఇబ్బందులు పడుతున్న బాలింతలు, పసిబిడ్డలు

నూజివీడు: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో జనరేటర్ వేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం ఆస్పత్రిలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కోతులు పడటంతో జంపర్‌లు కట్ అయ్యి దాదాపు గంట సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బాలింతలు, గర్భిణులు, పసిబిడ్డలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ దానిని వేయకపోవడంతో ఉక్కపోతతో రోగులు అల్లాడిపోయారు. లేబర్‌వార్డుతో పాటు స్పెషల్ రూమ్‌లు, సర్జికల్ రూమ్‌లలో బాలింతలు, పసిబిడ్డలు దాదాపు 25 మందికి పైగా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే ఆస్పత్రిలో డయాలసిస్ వార్డు సైతం ఉంది. విద్యుత్ సిబ్బంది వచ్చి జంపర్‌లను ఏర్పాటు చేసిన అనంతరం గంట తరువాత కరెంటు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నీటి నిల్వతో రోడ్డు మార్జిన్లు ధ్వంసం



సూరంపాలెం ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డు మార్జిన్‌లో నిలిచిన నీరు

చాట్రాయి: రోడ్లపై నీరు నిలవడంతో రోడ్ల మార్జిన్లు ధ్వంసం అవుతున్నాయి. ఇవి కోతక గురవుతున్నాయి. చనుబండ నుంచి సూరంపాలెం మెయిన్ రోడ్డు, కృష్ణారావుపాలెం మెయిన్ ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన నీరు నిలిచి రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. గతంలో రోడ్ల పక్కన నిలిచిన నీటిని మళ్లించేందుకు గ్యాంగ్‌మెన్‌లు ఉండేవారు. ఇప్పుడు ఆ వ్యవస్థను తొలగించడంతో రోడ్ల మార్జిన్ల పక్కన నిలిచిన నీటిని మళ్లించలేకపోవడంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు కొద్ది రోజులకే ధ్వంసమవుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్ల మార్జిన్లలో నిలిచిన నీటిని మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువతను సన్మార్గంలో నడిపించేదే భగవద్గీత



అనుగ్రహభాషణ చేస్తున్న త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహరాజ్ స్వామి



భగవద్గీత శ్లోకాల పఠనం చేస్తున్న విద్యార్థులు

త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహరాజ్ స్వామి

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతను క్రమశిక్షణతో కూడిన సన్మార్గంలో నడిపించేది భగవద్గీత అని మంగళగిరి శ్రీచైతన్య మహాప్రభు పాదపీఠ మందిరం పీఠాధిపతులు శ్రీ త్రిదండి భక్తి సుందర్ మంగళ్ మహరాజ్ స్వామీజీ అన్నారు. భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని వీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన శ్రీభగవద్గీత ప్రగతి పథం 8వ వార్షికోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక పఠనం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విజయావకాశాలను చూపించే దర్పిని భగవద్గీత అని పేర్కొన్నారు. భగవద్గీతను చదివే చిన్నారులు చురుకుదనం, మంచి నడవడిక కలిగి ఉంటారన్నారు. చిన్నారులతో భగవద్గీతలోని శ్లోకాలను పఠింపచేస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించటం శుభపరిణామమని చెప్పారు. శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సునీతా మధుసూదన్ దంపతులు నిర్వహించిన కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ఈస్ట్ జోన్ ప్రెసిడెంట్ జగదీష్, వ్యాపారవేత్త నంబూరు జనార్దన్, మాధవి దంపతులు, మాజేటి సూర్య వేణుగోపాల్ శ్రేష్ఠి, మంగళగిరి ఫణిధర్ సుజాత, లక్ష్మీప్రసన్న, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హోప్ ఫర్ స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది పేద విద్యార్థులకు పుస్తకాలు, అకాడమిక్ కిట్స్ పంపిణీ చేశారు. చిట్టినగర్ సొరంగంరోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్, బీజేపీ నాయకుడు అడ్డూరి శ్రీరామ్ విచ్చేశారు. 12 ఏళ్ల కిందట కొంత మంది స్నేహితులందరం కలిసి పేద విద్యార్థుల చదువుల కోసం తమ వంతు సాయం అందించాలనే భావనతో ఈ స్వచ్ఛంద సంస్థకు బీజం వేశామని చెప్పారు.
పేద విద్యార్థుల ముఖంలో చిరునవ్వు చూడాలనే ఆశతో సంస్థ ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మీ, గౌతమ్ స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు, సంస్థ ప్రతినిధులు నొచర్ల పవన్‌కల్యాణ్, సూర్యప్రకాష్, దుర్గ కిశోర్, తులసీ, ఆర్. మాధవ, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటున్నూ ఏలూరుజిల్లా, నూజివీడు మండలం, నూజివీడు పట్టణం, రామాయమ్మారావుపేట, డోరు నెంబరు : 25-284 కాపురస్థులు **దండమూడి సత్యన్నారాయణ** గారి కుమారుడు **విజయకుమార్** గారు గారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింటు ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ అర్బన్ గుణదల, మాచవరం, డోరు నెంబరు: 49-2-119 కాపురస్థులు (లేటు) గోవాడ వెంకటేశ్వరరావు గారి కుమారుడు గోవాడ వంశీకృష్ణ అనువారికి గల ఏలూరుజిల్లా, నూజివీడు మండలం, నూజివీడు సబ్ రిజిస్ట్రారువారి యిలాకా, తుక్కులూరు గ్రామంలోని రీ సర్వే నెంబరు : 170/2ఎ లో గల 2-47 సెంట్లు మెరక భూమి మరియు ఆర్. ఎస్. నెంబరు 170/2బి లో గల య.0-66 సెంట్లు మెరక భూమి వెరశి య.3-13 సెంట్లు మెరక భూమిని అందున గల బోరు బావి, కరెంటు మోటారు వగైరాలతో సహా కొనుగోలు చేయుటకు అగ్రిమెంటు కుదుర్చుకొనియున్నారు.

కావున సదరు విక్రయదారులకు వీలునామా ద్వారా సంక్రమించబడిన సదరు విక్రయ ఆస్తికి సంబంధించి ఎవ్వరికైననూ ఏవిధమైన ఆక్షేపణలు కానీ, అభ్యంతరములు కానీ వున్న యెడల యీ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా నా క్లయింటుకు కానీ, నాకు గానీ స్వయంగా తెలియజేయగలరు. సదరు విధంగా ఏవిధమైన ఆక్షేపణలు కానీ, అభ్యంతరములు కానీ రాని యెడల సదరాస్తి నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా పరిగణించడబడును. గడువు దాటిన తరువాత వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు పరిగణ లోనికి తీసుకొనబడవు. అట్టివి సదరాస్తిలో నా క్లయింటుకు గల హక్కుటలను భంగపర్చజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

పల్లగాని రాంబాబు
న్యాయవాది, సెల్ : 9848153188

నూజివీడు,
తేదీ : 22-06-2025.

పైలా దుర్గా ప్రసాద్
న్యాయవాది, సెల్ :8688885899